నేడు టీవీకే మహానాడు

- ఎన్నికల పొత్తుపై విజయ్ ప్రకటన చేస్తారా?
- కూలిన వందడుగుల జెండా స్తంభం
- కారు ధ్వంసం
- బ్యానర్ కడుతూ యువకుడి మృతి



మహానాడు ప్రవేశద్వారం



మహానాడు ప్రాంతం వద్ద గుమికూడిన జనం



ఇనుప జెండా స్తంభం కూలడంతో ధ్వంసమైన కారు

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) ద్వితీయ మహానాడు గురువారం ఉదయం అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఈ మహానాడులో పార్టీ అధినేత విజయ్ వచ్చే యేడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పొత్తుకు సంబంధించి కీలకమైన ప్రకటన చేస్తారని పార్టీ శ్రేణులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గత యేడాది విల్లుపురం జిల్లా విక్రవాండి వద్ద నిర్వహించిన తొలి మహానాడు విజయవంతం కావడంతో ఆ స్ఫూర్తితోనే మదురై వద్ద ఆయన ద్వితీయ మహానాడు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మదురై పారాపత్తిలో జరగనున్న ఈ మహానాడు కోసం 216 మీటర్ల పొడవు, 60 అడుగుల వెడల్పుతో ప్రత్యేక వేదికను నిర్మించారు. జిల్లా కార్యదర్శులు, పార్టీ ప్రముఖులు ఆశీనులయ్యేందుకు 200 కుర్చీలను ఏర్పాటు చేస్తున్నారు. వేదిక నుంచి 300 మీటర్ల పొడవుతో నిర్మించిన ర్యాంప్‌పై విజయ్ నడిచి వెళ్లి పార్టీ శ్రేణులకు దగ్గరగా దర్శనమిస్తారు. ఈ మహానాడులో పాల్గొనే నిమిత్తం విజయ్ బుధవారం రాత్రి విమానంలో మదురైకి వెళ్తున్నారు. మదురై విమానాశ్రయం నుంచి కారులో మహానాడు ప్రాంతానికి చేరుకుని పనులను పరిశీలించనున్నారు.

కూలిన పతాక స్తంభం...

ఇదిలా ఉండగా బుధవారం మధ్యాహ్నం మహానాడు ప్రవేశద్వారం ముందు వందడుగుల ఎత్తు ఇనుప జెండా స్తంభాన్ని ప్రత్యేక పీఠంపై ఉంచి బోల్టులు బిగించే పనులు జరిగాయి. ఆ సమయంలో ఆ ఎత్తైన వెయ్యి కేజీల బరువు కలిగిన జెండా స్తంభం పడకుండా ఉండేందుకు క్రేన్‌కు తాళ్లతో కట్టారు. ఇక ఆ స్తంభాన్ని సిమెంట్ క్రాంకీటుమధ్యనున్న ఇనుప చట్రంపై ఉంచుతుండగా క్రేన్‌కు కట్టిన తాడు ముడులు విడిపోయాయి. దీనితో ఆ బరువైన స్తంభం నేలకూలింది. ఆ స్తంభం కొన పార్కింగ్ చేసి ఉంచిన పార్టీ ప్రముఖుడి కారుపై పడింది. ఆ కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది.

బ్యానర్ కడుతూ...



మృతి చెందిన కాళీశ్వరన్ (ఫైల్ ఫొటో)

విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు వద్ద మదురైలో జరుగనున్న టీవీకే మహానాడు బ్యానర్ కట్టే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. శ్రీవిల్లిపుత్తూరు సమీపం ఇనామ్‌కరిసల్ కుళం వద్ద టీవీకే బ్యానర్ కట్టేందుకు కాళీశ్వరన్ (19) ఇనుపకమ్మీని తీసుకెళ్తుండగా విద్యుత్ స్తంభంలోని తీగ తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై కాళీశ్వరన్ ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

డీఎంకే కూటమిలోకి కొత్త పార్టీలు

- పీఎంకే రాందాస్ వర్గంతో మంతనాలు?
- డీఎండీకేకు చోటు లభించేనా?



చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కొత్త పొత్తులు పొడిచే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అన్ని పార్టీల కంటే ముందుగా అన్నాడీఎంకే జాతీయపార్టీ బీజేపీతో అత్యవసరం పొత్తును ఖరారు చేసుకోవడం రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. ఆ రెండు పార్టీల మధ్య పొత్తు కుదరడంతో అన్నాడీఎంకే మాట విని మరిన్ని పార్టీలు కూటమిలో చేరుతాయని ఆశించిన కమలనాథులకు తీవ్ర నిరాశే ఎదురైంది. మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం (ఓపీఎస్)ను కూటమిలో చేర్చుకునేందుకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) కుదరదంటూ భీష్మించారు.

డీఎంకే వైపు...

ఈ పరిస్థితుల్లో బీజేపీ, అన్నాడీఎంకే మధ్య కుదిరిన పొత్తు నచ్చని పార్టీలు డీఎంకే కూటమి వైపు దృష్టి సారిస్తున్నాయి. ఎనిమిదేళ్ల ముందుకు రూపొందిన డీఎంకే కూటమి చెక్కుచెదరకుండా పటిష్ఠంగానే కొనసాగుతోంది. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, ఎండీఎంకే, సీపీఐ, సీపీఎం, డీపీఐ, ముస్లింలీగ్, మక్కల్ నీదిమయ్యం, తమిళగవాళ్వురిమై కట్చి, మనిదనేయ మక్కల్ కట్చి మిత్రపక్షాలుగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే మక్కల్ నీదిమయ్యం కూటమిలో చేరినా సీట్ల కేటాయింపులలో సమస్యలు ఎదురుకావటంతో ఆ పార్టీకి సీట్లు లభించని పరిస్థితి ఏర్పడింది. దీనితో కమల్‌కు రాజ్యసభ సీటు కేటాయిస్తామనే హామీతో ఆ పార్టీతో పొత్తును ఖరారు చేసుకుంది. ఇచ్చిన మాట ప్రకారమే కమల్‌కు రాజ్యసభ సీటు కేటాయించడం, ఆయన ఎంపీగా ఎన్నికవటం జరిగాయి.

ఆ రెండు పార్టీలు, ఓపీఎస్...

రాబోవు అసెంబ్లీ ఎన్నికలలో పీఎంకే, డీఎండీకేలు డీఎంకే కూటమిలో చేరేందుకు పావులు కదుపుతున్నాయి. ఇటీవల డీఎంకే అధ్యక్షుడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ అనారోగ్యంతో బాధపడినప్పుడు డీఎండీకే చీఫ్ ప్రేమలత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ఆయన్ను నేరుగా కలుసుకుని పరామర్శించారు. ఆ సందర్భంగా స్టాలిన్ ఈ ముగ్గురితో స్నేహపూర్వకంగా మాట్లాడారు. ఆ సందర్భంలోనే ఈ ముగ్గురూ డీఎంకే కూటమిలో చేరడానికి సిద్ధంగా ఉన్నామని, తమకు తగినన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయిస్తే చాలునని స్టాలిన్‌తో పొత్తుపై ప్రాథమిక చర్చలను జరిపారని అరివాలయం వర్గాలు చెబుతున్నాయి. పీఎంకే రెండు వర్గాలుగా ఉన్నప్పటికీ అన్బుమణి బీజేపీ వైపు దృష్టిసారిస్తుండగా, రాందాస్ డీఎంకేతో పొత్తు కుదుర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. స్టాలిన్‌తో ఆయన తరచూ ఫోన్‌లో సంభాషిస్తున్నారని కూడా చెబుతున్నారు. ఈ పరిస్థితులలో ఈ మూడు పార్టీలను కూటమిలో చేర్చుకునే విషయాన్ని డీఎంకే అధిష్ఠానం కూడా కాస్త సీరియస్‌గానే పరిశీలిస్తోంది.

జీసీసీ తీర్మానం రద్దు చేయలేం

- ప్రైవేటుకు పారిశుధ్య పనుల వ్యవహారం
- కార్పొరేషన్ ఇచ్చే జీతాన్నే ప్రైవేటు ఏజెన్సీ ఇవ్వాలి
- మద్రాసు హైకోర్టు



పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని రెండు మండలాల్లో పారిశుధ్య పనులు ప్రైవేటుకు అప్పగించేలా కౌన్సిల్ సమావేశ తీర్మానాన్ని రద్దు చేయలేమని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. అలాగే, పారిశుధ్య కార్మికులను వారి ఉద్యోగాల నుంచి తొలగించే అవకాశం లేదని కార్పొరేషన్ చెబుతున్న విషయాన్ని గుర్తు చేసింది. అంతేగాక కాంట్రాక్ట్ సంస్థతో చర్చించి, జీసీసీలో పారిశుధ్య కార్మికులు చివరిసారిగా తీసుకున్న వేతనాన్ని అందజేయాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను ముగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి కె.సురేందర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జీసీసీ పరిధిలోని రెండు మండలాల్లో పారిశుధ్య పనులు ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ కార్మికుల హక్కుల ఉద్యమం తరఫున పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ బుధవారం విచారణ జరగ్గా.. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పారిశుధ్య పనులు ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ, శాశ్వత ఉపాధి కోరుతూ లేబర్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, పారిశుధ్య పనులు ప్రైవేటుకు అప్పగించలేరని, అందుకు లేబర్ కోర్టు అనుమతి తప్పనిసరిగా పొందాలని గుర్తు చేశారు. జీసీసీ చర్యల కారణంగా సుమారు 2,000 మంది కార్మికులు ఉపాధి కోల్పోయే అవకాశముందన్నారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించరాదని అభ్యర్థించారు. కార్పొరేషన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కార్మికులను తొలగించబోమని, కాంట్రాక్టర్ ద్వారా విధులు అప్పగిస్తామని చెప్పారు. జీసీసీ పరిధిలోని 15 మండలాల్లో 11 మండలాలు ఇప్పటికే ప్రైవేటు సంస్థలకు అప్పగించినట్లు తెలిపారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న 2,000 మంది పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్ట్ సంస్థ ద్వారా అధిక వేతనం, ప్రావిడెంట్ ఫండ్, బీమా సహా పలు ప్రయోజనాలతో ఉపాధి కల్పిస్తామన్నారు. పారిశుధ్య పనులు ప్రైవేటు అప్పగించడం ప్రభుత్వ విధాన నిర్ణయమని, ఈ నిర్ణయంలో చట్ట ఉల్లంఘన జరిగితే కోర్టు జోక్యం చేసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు 341 మంది కార్మికులు మాత్రమే పనిలో చేరగా, వారికి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన 1,900 మంది కార్మికులు పనిలో చేరేందుకు ఈ నెల 31వ తేది వరకు గడువు విధించినట్లు తెలిపారు. ఇరువర్గాల వాదనల అనంతరం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

- పీఎంకే నాయకుడి హత్యకేసు

ఎన్ఐఏ విస్తృత తనిఖీలు



తెన్‌కాశిలో ఓ నివాసగృహం వద్ద వివరాలు సేకరిస్తున్న ఎన్ఐఏ అధికారులు

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుభువనం పీఎంకే నాయకుడు రామలింగం హత్య కేసు విచారణలో భాగంగా ఎన్ఐఏ అధికారులు దిండుగల్, తెన్‌కాశి, కొడైకెనాల్ సహా 10 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపం తిరుభువనానికి చెందిన పీఎంకే నాయకుడు రామలింగం స్టీలు, ఇత్తడి సామాన్ల దుకాణం నడుపుతుండేవారు. తిరుభువనం ప్రాంతం వద్ద మతమార్పిడికి ప్రయత్నించిన కొందరిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ నేపథ్యంలో 2019 ఫిబ్రవరి 5న దారుణహత్యకు గురయ్యారు. ఆ సంఘటనపై తిరువిడైమరుదూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కురిచ్చిమలైకి చెందిన మహమ్మద్ రియాజ్, తిరుభువనంకు చెందిన నిజామ్‌అలీ, సార్బుద్దీన్, మహమ్మద్ రిజ్వాన్, తిరువిడైమరుదూరుకు చెందిన అజారుద్దీన్, తిరుమంగళకుడికి చెందిన మహమ్మద్ తవఫీక్, మహమ్మద్ పర్వీస్, అవనియాపురానికి చెందిన దవహీత్ బాషా, కారైక్కాల్ పెరుమాళ్ కోవిల్ వీధికి చెందిన మహమ్మద్ హుసేన్ కుద్దూస్ సహా పలువురిని ఈ కేసులో అరెస్టు చేశారు. ఈ కేసు విచారణను ఎన్ఐఏకి అప్పగించాలని రాష్ట్రానికి చెందిన రాజకీయ నేతలు, ప్రముఖులు డిమాండ్ చేశారు. దీంతో ఈ కేసును ఎన్ఐఏకి బదిలీ చేస్తూ రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వు జారీ చేసింది. ఆ మేరకు ఎన్ఐఏ అధికారులు తాజాగా విచారణ ప్రారంభించారు. ఆ తర్వాత ఈ హత్యకేసులో పరారీలో ఉన్న మహమ్మద్ అలీ జిన్నా, కుంభకోణం మేల్‌కావేరికి చెందిన అబ్దుల్ మజీద్, తంజావూరు జిల్లా పాపనాశం వడక్కుమాంగుడికి చెందిన బుర్హానుద్దీన్ తిరుమంగలకుడికి చెందిన సాహుల్ హమీదు, నఫీల్ హాజన్ అనే ఐదుగురి సమాచారం చెబితే రూ.25లక్షల బహుమానం చెల్లిస్తామంటూ ఎన్ఐఏ 2021లో ప్రకటన జారీ చేసింది. ఈ హత్యకేసులో పరారీలో ఉన్న ఐదుగురు సహా 18 మందిపై ఎన్ఐఏ అధికారులు కేసు నమోదు చేసి చెన్నై పూందమల్లి ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు కూడా దాఖలు చేశారు. అదే సమయంలో పరారీలో ఉన్న వ్యక్తులను అరెస్టు చేయడానికి చర్యలు ప్రారంభించారు. ఫలితంగా గతయేడాది నవబర్ 15న మహమ్మద్ అలీ జిన్నా అరెస్టయ్యాడు. అటు పిమ్మట ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అబ్దుల్ మజీద్, సాహుల్ హమీద్‌ని గత జనవరిలో చెన్నైలో అరెస్టు చేశారు. ఈక్రమంలో ఎన్ఐఏ అధికారులు బుధవారం ఉదయం నుంచి 10 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు జరిపారు. దిండుగల్ జిల్లా ఒట్టన్ సత్తిరం సంషుద్దీన్ కాలనీలో నివసిస్తున్న మహమ్మద్ యాసిన్ ఇంట్లో సోదాలు జరిపారు. ఆ ఇంట్లో ఉన్నవారిని విచారించారు. వత్తలకుండు గాంధీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో మహమ్మద్ అలీ జిన్నా మామ ఉమర్ కత్తాయ్‌కి నివాసగృహంలో కూడా ఎన్ఐఏ అధికారులు తనిఖీలు జరిపారు. ఇదే విధంగా కొడైకెనాల్‌లో ఐదు ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపారు.

మేట్టూరుకు జలకళ

- ఐదోసారి పూర్తి స్థాయిలో నిండిన జలాశయం

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డెల్టా జిల్లాలకు సాగుజలాలను, ప్రజలకు తాగునీటిని అందించే మేట్టూరు జలాశయం ఈ యేడాదిలో ఐదోసారి పూర్తిస్థాయిలో నిండింది. దీంతో ఆ జలాశయం 16 క్రష్ట్‌గేట్లను తెరచి జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. నైరుతి రుతుపవన ప్రభావిత వర్షాల కారణంగా కర్ణాటకలోని కబిని, కృష్ణరాజసాగర్ డ్యాంలలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకోవడంతో ఆ డ్యాంల నుంచి విడుదలయ్యే అదనపు జలాలు మేట్టూరు జలాశయంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ డ్యాం నుంచి డెల్టా జిల్లాలకు సాగుజలాలను జూన్ 12న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విడుదల చేశారు. ఆ సమయంలో డ్యాంలో ముప్పావుశాతం మేరకు నీటి నిల్వలు ఉన్నాయి. ఆ తర్వాత జూన్ 29న తొలిసారిగా పూర్తిస్థాయిలో (120 అడుగులు) జలాలతో నిండింది. అటు పిమ్మట జూలై 5న రెండోసారి, జూలై 25న నాలుగోసారి పూర్తిస్థాయిలో నీటిమట్టం నమోదైంది. ఆ తర్వాత రెండువారాలపాటు నీటిమట్టం క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో కావేరి నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రస్తుతం భారీగా వర్షాలు కురవడంతో పాటూ కర్ణాటకలోని జలాశయాలలో నీటిమట్టం విపరీతంగా పెరిగింది. దీంతో ఆ డ్యాంల నుంచి భారీ పరిమాణంలో అదనపు జలాలను విడుదల చేయడంతో మేట్టూరు డ్యాంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతూ వచ్చింది. మంగళవారం ఈ డ్యాంలో నీటిమట్టం 117.45 అడుగులకు చేరింది. బుధవారం ఉదయం 8గంటలకు నీటిమట్టం 120 అడుగులకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలోకి 1,08,529 క్యూసెక్కుల జలాలు ప్రవేశిస్తున్నాయి. డ్యాం నుంచి 90 వేల క్యూసెక్కులను చొప్పున జలాలను దిగువకు వదులుతున్నారు. మేట్టూరు డ్యాం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో కావేరి నదిలో ఎవరూ స్నానం చేయకూడదని అధికారులు ఆంక్షలు విధించారు.

గవర్నర్ ఢిల్లీ పయనం

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆకస్మికంగా హస్తినకు బయలుదేరి వెళ్లారు. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు గవర్నర్ విమానంలో ఢిల్లీకి పయనమయ్యారు. ఆయనతోపాటు కార్యదర్శి, సహాయకులు, భద్రతా అధికారి తదితరులు కూడా వెళ్లారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లే ఆయన ఓ విశ్వవిద్యాలయంలో జరుగనున్న స్నాతకోత్సవంలో పాల్గొనన్నారు. ఢిల్లీలో బస చేస్తున్నప్పుడు ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా ఇతర మంత్రులతో భేటీ కానున్నారు. ఈ నెల 23 శనివారం సాయంత్రం 4.30 గంటలకు ఎయిర్‌ఇండియా విమానంలో చెన్నైకి తిరిగి రానున్నారని రాజ్‌భవన్ అధికారులు పేర్కొన్నారు.

సీఎం స్టాలిన్ 50వ వివాహ వార్షికోత్సవం

మిత్రపక్షాల నేతల శుభాకాంక్షలు



గోపాలపురం నివాసానికి సతీసమేతంగా వెళ్లి తన మాతృమూర్తి దయాళు అమ్మాళ్ ఆశీస్సులందుకున్న సీఎం స్టాలిన్

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్ బుధవారం ఉదయం తమ 50వ వివాహ వార్షికోత్సవాలను కుటుంబ సభ్యుల నడుమ నిరాడంబరంగా జరుపుకున్నారు. తొలుత ఇరువురూ మెరీనాబీచ్‌లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధి ప్రాంతానికి మంత్రులు సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, కేఎన్ నెహ్రూతో వెళ్లి పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత గోపాలపురంలోని కరుణానిధి నివాసగృహానికి వెళ్లిన స్టాలిన్ తన మాతృమూర్తి దయాళు అమ్మాళ్ ఆశీస్సులందుకున్నారు. ఇంటిపట్టునే వృద్ధాప్య సమస్యలకు చికిత్సలు పొందుతున్న దయాళు అమ్మాళ్ వద్ద ఇరువురు కాసేపు కబుర్లాడారు. అక్కడి నుంచి కారులో బయలుదేరి సిరుమలర్ బధిరుల పాఠశాలకు వెళ్లి చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించారు. స్టాలిన్ తోపాటు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు సిట్రరసు, సిరుమలర్ పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిస్టర్ రోస్లిన్ పాల్గొన్నారు. ఆ తర్వాత తమ ఇంటికి చేరుకున్న ఈ దంపతులకు తనయుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించి మిఠాయిలు పంచిపెట్టారు.

ఆమెది ఇచ్చిపుచ్చుకునే ధోరణి

ఈ సందర్భంగా స్టాలిన్ తన సతీమణి దుర్గాస్టాలిన్ ఎల్లప్పుడు ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అవలంబిస్తుందని, అర్ధ శతాబ్దంపాటు అర్ధాంగిగా ప్రేమాభిమానాలు పంచిపెట్టి జీవనయానం సవ్యంగా సాగేందుకు దోహదపడిందని ప్రశంసించారు. ఉదయనిధి తన తల్లిదండ్రులు ఇలాగే సంతోషంగా చిరకాలం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నానని తన ఎక్స్‌పేజీలో సందేశం పొందుపరిచారు.

నేతల శుభాకాంక్షలు

50వ వివాహ వార్షికోత్సవాలను పురస్కరించుకుని డీఎంకే మిత్రపక్షాల నాయకులు ఒక రోజు ముందే మంగళవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో స్టాలిన్ దంపతులను కలుసుకుని శుభాకాంక్షలు అందజేశారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ఎండీఎంకే నేత వైగో, సీపీఐ నేత ముత్తరసన్, సీపీఎం నేత షణ్ముగం, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ జాతీయ అధ్యక్షుడు కేఎం ఖాదర్ మొహిద్దీన్, మక్కల్ నీదిమయ్యం అధినేత, రాజ్యసభ సభ్యుడు కమల్, మనిదనేయ మక్కల్ కట్చి నేత ఎంహెచ్ జవాహిరుల్లా తదితరులు స్టాలిన్, దుర్గాస్టాలిన్‌ను పూలమాలలతో సత్కరించి కానుకలందజేసి శుభాకాంక్షలు అందజేశారు. ఆ సందర్భంగా స్టాలిన్ నివాసంలో మిత్రపక్షాల నాయకులందరికీ విందుభోజనం కూడా ఏర్పాటు చేశారు.



మెరీనాబీచ్‌లో కరుణానిధి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న స్టాలిన్, దుర్గాస్టాలిన్

సమాచార దృష్టి

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

అడయార్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 21న గురువారం జరిగే 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ విడుదల చేసింది. తిరువొత్తియార్ మండలం 10వ వార్డు పూంతోట్టం వీధిలోని పూనతోట్టం క్రీడా మైదానం, తండయార్ పేట మండలం 48వ వార్డు పాత వాషర్‌మెన్‌పేట మింట్ సుబ్బరాయన్ వీధి, రాయపురం మండలం 58వ వార్డు సిడన్‌హామ్స్ రోడ్డులోని చెన్నై కార్పొరేషన్ కమ్యూనిటీ హాలు, అంబత్తూర్ మండలం 80వ వార్డు సూరపేట మెయిన్ రోడ్డులోని పీటీఆర్ కల్యాణ మండపం, తేనాంపేట మండలం 117వ వార్డు మేలని రోడ్డులోని మనోరమ రీసెర్చి స్కూలు, కోడంబాక్కం మండలం 141వ వార్డు సీబీటీ నగర్ మూడో క్రాస్ వీధిలోని క్రీడా మైదానం, ఆలందూర్ మండలం 165వ వార్డు వానువంపేట పలండియప్పన్ ఆలయ వీధిలోని శ్రీపలండియమ్మన్ కల్యాణ మండపం, అడయార్ మండలం 1765వ వార్డు తమిళనాడు హౌసింగ్ బోర్డు 5వ అవెన్యూలోని అమ్మ మండపం, పెరుంగుడి మండలం 190వ వార్డు పల్లికరనై, వేళచ్చేరి రోడ్డులోని ఐశ్వర్య కల్యాణ మండపం తదితర 9 ప్రాంతాల్లో శిబిరాలు జరుగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరాలు జరుగుతాయి.

'ఉంగళుడన్ స్టాలిన్'పై పోటీలకు ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): 'ఉంగళుడన్ స్టాలిన్' పథకంపై ప్రజల మనోభావాలు తెలుసుకునేలా సమాచార శాఖ పోటీలు నిర్వహించనుంది. 'ఉంగళుడన్ స్టాలిన్' పథకం జూలై 15న ప్రారంభం కాగా, నగర ప్రాంతాల్లో 13 శాఖలకు చెందిన 43 సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో 15 శాఖలకు చెందిన 46 సేవలు అందిస్తున్నారు. ఈ పథకంపై ప్రజల అభిప్రాయం తెలుసుకునేలా సమాచార శాఖ మంగళవారం నుంచి సెప్టెంబరు 20వ తేది వరకు పోటీలు నిర్వహించనుంది. పోటీల్లో విజేతలకు సమాచార శాఖ మంత్రి స్వామినాథన్, సర్టిఫికెట్లు, పతకాలు అందించనున్నారు. ఆ ప్రకారం, ఈ పథకంలో అందజేస్తున్న సేవలతో తమ ఆర్థిక పరిస్థితి, జీవనాధారం ఎలా మెరుగైంది అనే విషయం తెలిపేలా వ్యక్తి, బృందాల ద్వారా వీడియో తీసి సమాచార శాఖకు పంపించాలి.

నేటినుంచి ఇంజనీరింగ్ ఉప కౌన్సెలింగ్

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్లకు ఉప కౌన్సెలింగ్ ఈనెల 21న గురువారం ప్రారంభం కానుంది. ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, జనరల్ కౌన్సెలింగ్‌లో పాల్గొనని విద్యార్థులకు ఉప కౌన్సెలింగ్‌లో పాల్గొనేలా జూలై చివరి వారం నుంచి ఈ నెల 14వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ జరిగింది. 16,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఉప కౌన్సెలింగ్ బుధవారం నుంచి 23వ తేది వరకు జరగనుంది. ఉప కౌన్సెలింగ్ ముగిసిన అనంతరం, ఎస్సీ-అరుంధతీయుల కోటాలో ఖాళీగా ఉన్న సీట్లకు ఎస్సీ విద్యార్థులు చేరేలా ఈ నెల 25,26 తేదీల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 26వ తేదీతో అన్నిరకాల కౌన్సెలింగ్ పూర్తవుతుంది.

29న గ్రూప్-2 పోస్టుల రెండో విడత కౌన్సెలింగ్

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-2, గ్రూప్-2ఏ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 29న రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ప్రకటించింది. గత జూన్ 20న నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో అభ్యర్థులు పొందిన మార్కులు, ర్యాంకుల జాబితాను టీఎన్‌పీఎస్సీ తన వెబ్‌సైట్‌లో వెలువరించింది. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మద్రాస్ హైకోర్టు సమీపంలోవున్న టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో ఈనెల 29న నిర్వహించనున్న రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంది.ఈ కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి.

వారాంతపు సెలవుల్లో 1,040 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) పేర్కొంది. స్థానిక కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు శుక్రవారం (ఈనెల 22వ తేది) 340 బస్సులు, శనివారం 350 బస్సులు నడపనున్నారు. కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టినం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 55 బస్సులు, మాధవరం నుంచి శుక్ర, శనివారాల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. అలాగే, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర ప్రాంతాల నుంచి పలు ప్రాంతాలకు 200 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

ప్లస్ టూ సప్లిమెంటరీ రీ టోటల్ ఫలితాల విడుదల

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షల రీ టోటలింగ్, రీ వాల్యుయేషన్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ మేరకు పరీక్ష శాఖ డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షలు గత జూన్-జూలై నిర్వహించగా, పలువురు విద్యార్థులు రీ వాల్యుయేషన్, రీ టోటలింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, ఈ ఫలితాలు పరీక్ష శాఖ వెబ్‌సైట్‌లో విడుదల చేశామన్నారు. దరఖాస్తు చేసుకుని జాబితాలో పేర్లు లేని విద్యార్థుల మార్కుల్లో ఎలాంటి మార్పులు లేవని గ్రహించాలని, ఒరిజినల్ మార్కుల జాబితా అందించే తేది త్వరలో ప్రకటిస్తామని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

రవాణా శాఖ డ్రైవర్లు, కండక్టర్ల పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖ డ్రైవర్లు, కండక్టర్ల పోస్టుల భర్తీకి అన్నా విశ్వవిద్యాలయం ప్రవేశ పరీక్షా కేంద్రంలో నిర్వహించిన పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జూలై 27వ తేది పరీక్ష నిర్వహించగా, 22,492 మంది దరఖాస్తు చేసుకోగా, 19,405 మంది పరీక్షకు హాజరయ్యారు. ఫలితాలు https://tancet.annauniv.edu/tancet/irt/index.phpలో విడుదలయ్యాయి. అభ్యర్థులు తమ దరఖాస్తు నెంబరు లేదా రిజిస్ట్రేషన్ నెంబరు తదితరాలు నమోదుచేసి ఫలితాలు తెలుసుకోవచ్చు.

పాండురంగస్వామి కీర్తనలతో ప్రచారం



భజన బృందంతో కీర్తనలు ఆలపిస్తున్న బ్రహ్మశ్రీ విఠల్‌దాస్ మహరాజ్ - హాజరైన భక్తులు

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పాండురంగస్వామి కీర్తనలతో రాష్ట్రంలో ప్రచారం సాగిస్తున్నట్లు బ్రహ్మశ్రీ విఠల్ దాస్ మహరాజ్ పేర్కొన్నారు. పెరంబూరు పటేల్‌రోడ్డులోని కలిగి రంగనాథన్ మాన్‌ఫోర్ట్ పాఠశాల (కేఆర్ఎం) ప్రాంగణంలోని రంగాహాలులో మంగళవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు విఠల్‌దాస్ నేతృత్వంలో 'నామసంకీర్తనం' శ్రావ్యంగా సాగింది. శ్రీవెంకటేశ్వర భక్త సమాజం, శ్రీకృష్ణ స్వీట్స్, కేఆర్ఎం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు సమాజం అధ్యక్షుడు తమ్మినేని బాబు, కార్యదర్శి ఎస్.వెంకటరామన్, కార్యదర్శి సి.కోదండ రామయ్య, శ్రీకృష్ణ స్వీట్స్ సీఈవో పూర్ణిమ, కేఆర్ఎం పాఠశాల కరస్పాండెంట్ ఆర్.జనార్దన్ దంపతులు, భువనేశ్వర్, సుదర్శనం తదితరులు విఠల్‌దాస్‌ను సత్కరించారు. ముందుగా విఠల్‌దాస్ మాట్లాడుతూ, పుండరీక పాండురంగస్వామి విశిష్టత గురించి కీర్తనల ద్వారా తాను సాగిస్తున్న ప్రచారానికి భక్తుల నుంచి స్పందన వస్తోందన్నారు. ఉత్తర చెన్నై మొట్టమొదటి సారిగా తమ్మినేని బాబు బృందం ఏర్పాటు చేసిన నామసంకీర్తనం సభలో నిండుదనం కనిపించిందన్నారు. నేటి ఆధునిక యుగంలో భక్తి ద్వారానే దైవాన్ని చేరుకోవచ్చని వివరించారు. చివరగా భక్తులందరికీ ప్రసాదం పంపిణీ చేశారు.

ఆరోపణలపై అన్బుమణి వారంలోపు సంజాయిషీ ఇవ్వాలి

● పీఎంకే నేత రాందాస్ గడువు

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పదహారు ఆరోపణలపై వారంలోపు అన్బుమణి సంజాయిషీ ఇవ్వాలని ఆయన తండ్రి, పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ గడువు విధించారు. పీఎంకే నిర్వహణలో తండ్రీకొడుకుల మధ్య విభేదాలు ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. తండ్రీకొడుకులను బుజ్జగించి సమాధాన పరిచేందుకు ఆ పార్టీ ప్రధాన నిర్వాహకులు, కుటుంబసభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ నేపథ్యంలో, అన్బుమణి ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం అన్బుమణి పీఎంకే అధ్యక్షుడిగా కొనసాగుతారని తీర్మానం ఆమోదించి ఎన్నికల కమిషన్‌కు పంపించింది. మరోవైపు పుదుచ్చేరిలో ఇటీవల డాక్టర్ రాందాస్ ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం కూడా రాందాస్‌ను పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లుగా ప్రకటించింది. ఈ సమావేశం అన్బుమణిపై పదహారు ఆరోపణలు గుప్పించింది. ఈ ఆరోపణలపై వారం రోజుల్లోపు అన్బుమణి సంజాయిషీ ఇచ్చుకోవాలని, లేకపోతే ఆయనపై క్రమశిక్షణ చర్యలుంటాయని రాందాస్ హెచ్చరించారు.

బీజేపీ నేత నగర ప్రవేశంపై ఆంక్షల రద్దు

అడయార్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో ప్రవేశించరాదని బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుడు నెడుకుండ్రం సూర్యకు నగర పోలీసు కమిషనర్ జారీచేసిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. నెడుకుండ్రం సూర్యపై పలు కేసులు విచారణలో ఉన్న నేపథ్యంలో, ఆయనను నగరంలో ప్రవేశించేందుకు ఎందుకు నిషేధం విధించరాదు అంటూ వివరణ కోరుతూ కొళత్తూర్ పోలీసు అసిస్టెంట్ కమిషనర్ నోటీసు జారీచేశారు. ఈ నోటీసుకు సూర్య వివరణ ఇచ్చిన నేపథ్యంలో, అతను గత ఏప్రిల్ 25 నుంచి ఏడాది పాటు చెన్నైలో ప్రవేశించరాదని పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. వాటిని వ్యతిరేకిస్తూ సూర్య దాఖలుచేసిన పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి సతీష్‌కుమార్ విచారించగా, సూర్య తరఫున.. పోలీసు శాఖ నోటీసుకు తగిన వివరణ ఇచ్చినా, పరిశీలించకుండా ఉత్తర్వులు జారీ చేశారని వాదించారు. పిటిషనర్ వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి, పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గిండి విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం చిరునామా మార్పు

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు స్థానిక గిండి శాఖ కార్యాలయ పరిధిలోని కేకే నగర్ 110 కేవీ విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో విద్యుత్ బిల్లుల వసూలు సహా ఇతర సేవలను అందించేలా కార్యాలయం పనిచేస్తోంది. ఈ కార్యాలయం, విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రం ఈ నెల 22వ తేది నుంచి గిండి ఇండస్ట్రియల్ ఎస్టేట్, బ్లాక్ నెం6, సీ టూ బి, ఎస్‌కేసీఎల్ భవనం ఎదురుగా పనిచేయనుంది.

మదురైలో ఫ్లెక్సీల తొలగింపు

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మదురై కార్పొరేషన్ పరిధిలో అనుమతిలేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్రకటన బోర్డులను గంటలోపు తొలగించాలని హైకోర్టు మదురై బెంచ్ పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల పక్కన ఉన్న జెండా స్తంభాలు, ప్రకటన బోర్డులను తొలగించాలని సంబంధిత శాఖ అధికారులకు, రాజకీయ పార్టీలకు ఇటీవల మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను అమలుపరిచే విధంగా పలు జిల్లాల్లో ఉన్న జెండా స్తంభాలను, రహదారులశాఖ అధికారులు తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మదురై కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్రకటన బోర్డులను తొలగించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనవాజ్యం బుధవారం మదురై బెంచ్ ముందుకు విచారణకు వచ్చింది. అప్పుడు అనుమతిలేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులను గంటలోపు తొలగించి నివేదిక దాఖలు చేయాల్సిందిగా న్యాయమూర్తుల బెంచ్ మదురై నగర పోలీసు కమిషనర్‌కు ఉత్తర్వులు జారీచేసింది.

రేపు నెల్లైలో బీజేపీ బూత్ కమిటీల సమావేశం

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో ఈనెల 22న శుక్రవారం బీజేపీ బూత్ కమిటీ నిర్వాహకుల సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొంటారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. తిరునల్వేలి సమీపంలోని పాళయంకోటలో స్వాతంత్ర సమరయోధులు ఒండివీరన్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన మణిమండపంలోని విగ్రహానికి బీజేపీ తరఫున బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేంద్రన్ మాట్లాడుతూ... తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో తాను మర్యాదపూర్వకంగా భేటీ అయ్యాయని, ఇందులో రాజకీయాలు తెలిపారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడికి రాజకీయపార్టీని ప్రారంభించే హక్కు వుందని, ఆరీతిలోనే విజయ్ టీవీకేను స్థాపించారన్నారు. 2026 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే 200 అసెంబ్లీ స్థానాల్లో గెలిపించేలా తమ పార్టీ బూత్ కమిటీ నిర్వాహకులకు తిరునల్వేలిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఐదు లోక్‌సభ నియోజకవర్గాలు, 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 8,595 బూత్ కమిటీలకు చెందిన సుమారు లక్ష మందికి పైగా నిర్వాహకులు పాల్గొంటారని తెలిపారు.

క్రీడలతో చెడు అలవాట్లకు దూరం

● మంత్రి ఎస్ఎం.నాజర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నాజర్

తిరుత్తణి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడిలోని పోలీసు క్రీడా మైదానంలో పాఠశాల విద్యార్థులకు జిల్లాస్థాయి వార్షిక అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. కలెక్టర్ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ఎం.నాజర్, పూందమల్లి ఎమ్మెల్యే కృష్ణస్వామి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాజర్ మాట్లాడుతూ, ఇటీవల విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలవుతున్నారని, క్రీడలతో వ్యసనాలకు దూరంగా ఉండొచ్చన్నారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలో క్రీడలను ప్రోత్సహించేలా రూ.200 కోట్లను కేటాయించారని, దేశవ్యాప్తంగా పలు క్రీడా పోటీల్లో రాష్ట్రానికి చెందిన యువత జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్నారన్నారు. ఆవడి మేయర్ ఉదయకుమార్, సీఈవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోవై వరకే మేట్టుపాళయం రైలు

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి మేట్టుపాళయం వరకు నడుపుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఆ మార్గంలో చేపడతున్న మరమ్మతుల కారణంగా ఈ నెల 26, సెప్టెంబర్ 1వ తేదీల్లో కోవై వరకే నడపనున్నట్లు దక్షిణ రైల్వేశాఖ తెలిపింది. కోవై ఉత్తరం - కారమడై రైల్వే విద్యుత్ మార్గంలో మరమ్మతులు చేపట్టేందుకు నిర్ణయించారు. చెన్నై ఎంజీఆర్ సెంట్రల్ నుంచి మేట్టుపాళయం వరకు నడుపుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సేవలను ఈ నెల 26, సెప్టెంబర్ 1వ తేదీల్లో కోవై-మేట్టుపాళయం మధ్య తాత్కాలికంగా రద్దు చేయనున్నట్లు దక్షిణ రైల్వేశాఖ అధికారులు తెలిపారు.

ఊటీ-మేట్టుపాళయం మధ్య ప్రత్యేక కొండ రైలు సేవలు

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల్లో ఊటీకి వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం ఊటీ - మేట్టుపాళయం మధ్య ప్రత్యేక కొండ రైలు సేవలు అందుబాటులో ఉంటాయని దక్షిణ రైల్వే తెలిపింది. ఆ ప్రకారం నెం.06171 మేట్టుపాళయం - ఊటీ మధ్య ఈ నెల 23, 30, సెప్టెంబరు 5, 7, అక్టోబరు 2, 4, 17, 19 తేదీల్లో, మరో మార్గంలో నెం.06172 ఊటీ - మేట్టుపాళయం మధ్య ఈనెల 24, 31, సెప్టెంబరు 6, 8, అక్టోబరు 3, 5, 18, 20 తేదీల్లో ప్రత్యేక కొండ రైలు నడపుతున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

తమిళనాడు కాంగ్రెస్ మానవ హక్కుల విభాగం రద్దు

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు కాంగ్రెస్ మానవ హక్కుల విభాగం నిర్వాహకుల సమావేశం నగరంలో మంగళవారం ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మహాత్మ శ్రీనివాసన్ నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశం ఆమోదించిన తీర్మానం వివరాలు ఇలా ఉన్నాయి... శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, శ్రీనివాసన్ మినహా అందరు నిర్వాహకులు, వారు నిర్వహిస్తున్న పదవుల నుంచి తొలగించారు. ఈ విభాగానికి ఆన్‌లైన్ ద్వారా 3,500 మంది మాత్రమే సభ్యులుగా చేరారని, ఆ ప్రకారం, సభ్యుల నియామకం సక్రమంగా లేదన్నారు. ఈ క్రమంలో, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల విభాగం రద్దు చేస్తున్నట్లు సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సీపీఆర్ ఎంపిక చేయడం రాజకీయ వ్యూహం

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి తరఫున ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించడం రాజకీయ వ్యూహంలో భాగమేనని ద్రావిడర్ కళగం అధ్యక్షుడు వీరమణి తెలిపారు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థి సుదర్శన్ రెడ్డి ప్రజాస్వామ్య దృక్పథం కలిగిన మానవతావాది అని, ప్రజాస్వామ్యం కాపాడేలా ప్రతిపక్ష పార్టీలు తమ కర్తవ్యాన్ని నెరవేర్చాయన్నారు. తమిళుల ఆదరణ కోరడం రాజకీయ వ్యూహాల్లో భాగమేనని వీరమణి తెలిపారు.

ఏడాదిన్నర బాలుడిని ఎత్తుకెళ్లిన శునకం

అడయార్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి ప్రవేశించిన వీధి శునకం నిద్రపోతున్న బాలుడిని ఎత్తుకెళ్లడం కలకలం రేపింది. తిరువళ్లూర్ జిల్లా కూత్తానల్లూర్‌లోని యువతికి ఏడాదిన్నర కుమారుడున్నాడు. బుధవారం మధ్యాహ్నం కుమారుడుని ఉయ్యాలలో నిద్రపుచ్చిన యువతి, ఇంటి పనులు చేసుకుంటోంది. ఆ సమయంలో ఇంట్లో ప్రవేశించిన వీధి శునకం ఉయ్యాల నుంచి బాలుడిని నోట కరుచుకుని బయటకు పరుగులు తీసింది. అంతలో బాలుడి అవ్వ శునకాన్ని అడ్డుకోవడంతో ఆమెపై కూడా శునకం దాడిచేసింది. ఒంతలో యువతి అక్కడకు చేరుకుని శునకాన్ని కర్రతో తరిమి, గాయపడిన బాలుడు, అవ్వను ప్రభుత్వాసుపత్రికి తరలించింది.

25న ఈరోడ్‌లో 'అగ్నివీర్' శిబిరం

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): 'అగ్నివీర్' పథకంలో, భారత సైన్యంలో అభ్యర్థుల ఎంపిక శిబిరం ఈనెల 25వ తేది ఈరోడ్‌లో జరగనుంది. 'అగ్నివీర్ జనరల్ డ్యూటీ' పోస్టుకు ఈ నెల 25వ తేది, టెక్నికల్ విభాగానికి 25 నుంచి సెప్టెంబరు 2వ తేది వరకు అభ్యర్థుల ఎంపిక జరగనుంది. అనంతరం సెప్టెంబరు 3,4 తేదీల్లో ఆంధ్ర, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అభ్యర్థుల నియామక శిబిరాలు నిర్వహించనున్నారు. తదుపరి 5వ తేది వైద్య పరీక్షలు నిర్వహించి, 6,7 తేదీల్లో కేటాయింపు జరగనుంది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు వేర్వేరుగా శిబిరాల్లో పాల్గొనాల్సిన తేది వివరాలు ఎస్ఎంఎస్, ఈ-మెయిల్ ద్వారా పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు పేర్కొంది.

మేడవాక్కం: ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలని, ఏరికరై మెయిన్ రోడ్డు, పెరుంబాక్కం మెయిన్ రోడ్డు.

జల్లాడియన్‌పేట: జయచంద్రన్ నగర్, వీరాత్తమ్మన్ ఆలయ వీధి, రైస్‌మిల్ రోడ్డు.

పల్లికరనై: మీనాక్షి నగర్, సాయిగణేష్ నగర్, సాయి బాలాజి నగర్, రాజా నగర్, కృష్ణా నగర్, పసుమ్‌పొన్ నగర్, పాండియన్ నగర్, ధర్మలింగం నగర్, వివేకానంద నగర్, వల్లాల్‌పారి నగర్.

పెరంబాక్కం: కైలాష్ నగర్, ఆంటోని నగర్, కృష్ణా నగర్, రాధా నగర్, సౌమ్య నగర్, నూకంపాలయమ్మన్ రోడ్డు, చేరన్ నగర్, గాంధీ నగర్ సొసైటీ, ఆదిని వీధి, శేఖరన్ నగర్, ఎంబసీ రెసిడెన్సీ, కాసాగ్రాండ్ ఫస్ట్ సిటీ, గ్లోబల్ హాస్పిటల్ మెయిన్ రోడ్డు.

పులియాంతోపు: పౌడర్ మిల్స్ రోడ్డు, వీరచెట్టి వీధి, పార్థసారథి వీధి, గోవిందసింగ్ వీధి, ప్రకాశరావు కాలనీ, డెకోస్టర్ రోడ్డు, శాస్త్రి నగర్ 1 నుంచి 22 వీధులు, నరసింహ నగర్ 1 నుంచి 5 వీధులు, టీవీకే నగర్ 1 నుంచి 8 వీధులు, సత్యవాణిముత్తు నగర్ 1 నుంచి 5 వీధులు, కావాంగరై వీధి, కస్తూరిబాయి కాలనీ ఏ,బి బ్లాక్ 1 నుంచి 5 వీధులు.

నమ్మాళ్వార్‌పేట: సుబ్రయాన్, రామానుజం గార్డెన్ వీధి, శాండియప్ప వీధి, చిన్నబాబు వీధి, కొన్నూర్ హైరోడ్డు, పీడబ్ల్యూడీ క్వార్టర్స్, బరాక్కా రోడ్డు, నల్లయ్య వీధి, సెక్రటరేట్ కాలనీ 4,5 వీధులు

తిరుముల్లైవాయల్: ఆర్చ్ అంటోని నగర్, పోదూర్

తిరువాన్మియూర్: శాస్త్రినగర్ తిరువళ్లువర్ రోడ్డు, ఈస్ట్ వీధి, వాల్మీకి వీధి, శివసుందర అవెన్యూ 1వ వీధి, కళాక్షేత్ర రోడ్డు 2వ వీధి, బాలు అవెన్యూ

ముడిచూర్: స్వామినగర్, నవాబాబిబుల్లా నగర్, శివవిష్ణు నగర్, కొమ్మియమ్మన్ నగర్, లింగం నగర్, అన్నా వీధి, రాజరాజన్ వీధి.

అడయార్: ఇందిరా నగర్ 1 నుంచి 3 మెయిన్ రోడ్డు, కస్తూరిబాయి నగర్ 1 నుంచి 3వ క్రాస్ వీధులు, కెనాల్ బ్యాంక్ రోడ్డు, భక్తవత్సలం 1, 2 వీధులు, సర్దార్ పటేల్ రోడ్డు, అన్నా అవెన్యూ, గోవిందరాజపురం 1,2 వీధులు.

ఆకాష్ భాస్కరన్ కేసులో...

ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్‌కు హైకోర్టు నోటీసు

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తమిళ సినీ నిర్మాత ఆకాష్ భాస్కరన్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అసిస్టెంట్ డైరెక్టర్ విచారణకు నేరుగా హాజరుకావాలంటూ మద్రాస్ హైకోర్టు ఉత్తర్వు జారీ చేసింది. రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని మద్యపానీయాల విక్రయ సంస్థ టాస్మాక్ అవినీతి కేసులకు సంబంధించి ఆకాష్ భాస్కరన్, పారిశ్రామికవేత్త విక్రమ్ రవీంద్రన్ నడుపుతున్న సంస్థల్లో ఈడీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు. ఆ చర్యలను వ్యతిరేకిస్తూ ఆకాష్ భాస్కరన్ తరఫున దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు స్వాధీనం చేసుకున్న దస్తావేజులను తిరిగి అప్పజెప్పాలని ఈడీకి ఉత్తర్వులు జారీచేసింది. అంతేకాక తదుపరి చర్యలు తీసుకోకుండా స్టే విధించింది. ఈ నేపథ్యంలో, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి ఈడీ తనకు సమన్లు జారీ చేసిందంటూ ఆకాష్ భాస్కరన్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ జస్టిస్ ఎంఎస్ రమేష్, జస్టిస్ వి.లక్ష్మీనారాయణతో కూడిన ధర్మాసనం ఎదుట బుధవారం విచారణకు వచ్చింది. విచారణ అనంతరం ఈ కేసులో ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ వికాస్‌కుమార్ సెప్టెంబర్ 17న నేరుగా విచారణకు హాజరుకావాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

పెళ్లి రిసెప్షన్‌లో విషాదం

● డ్యాన్స్ చేస్తూ గుండెపోటుతో మహిళ మృతి


జీవా (ఫైల్‌ఫోటో) - సొమ్మసిల్లి పడిన జీవా

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలో ఓ వివాహ రిసెప్షన్ వేడుకల సందర్భంగా అందరితో కలిసి డ్యాన్స్ చేసిన మహిళా ఉన్నట్టుండి స్టేజ్‌పై కుప్పకూలింది. కాంచీపురంలోని ప్రముఖ మందుల దుకాణం యజమాని జ్ఞానం, ఆయన భార్య జీవాతో కలిసి మంగళవారం రాత్రి జరిగిన బంధువుల పెళ్లి వేడుకలకు వెళ్లారు. ఆ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో కొంతమంది నృత్యం చేశారు. ఆ సమయంలో జీవా స్టేజ్‌పైకి ఎక్కి నృత్యం చేశారు. పది నిమిషాల తరువాత జీవా ఉన్నట్టుండి కుప్పకూలారు. వెంటనే ఆమెకు ప్రాథమిక చికిత్సలు చేసినప్పటికీ కళ్లు తెరవకపోవడంతో పక్కనే ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి మృతి చెందినట్టు ప్రకటించారు.

తిరుచెందూరు ఆలయంలో ఇరువర్గాల ఘర్షణ

● 2 గంటలపాటు ఆగిన స్వామివారి ఊరేగింపు


గొడవపడుతున్న ఆలయ అర్చకులు

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరు చెందూరు సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆవణి ఉత్సవాల్లో భాగం గా బుధవారం ఉదయం ఉత్సవమూర్తికి నగలను ధరింపజేసే విషయంలో శివాచార్యులు, త్రిసుందరర్ మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ ఆలయంలో ఆవణి ఉత్సవాలు ఈనెల 14న ధ్వజారోహణంతో ప్రారంభమ య్యాయి. ఆరోరోజైన బుధవారం ఉదయం స్వామివారి ఊరేగింపునకు సం బంధించి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో ఉత్సవమూర్తికి ఆభరణాలను ఎవరు ధరింపజేయాలనే విషయమై శివాచార్యులు, త్రిసుం దరర్ తీవ్రంగా గొడవపడ్డారు. ఈ ఘర్షణను ఆలయ నిర్వాహకులు నిరో ధించలేకపోయారు. దీంతో ఉత్సవమూర్తుల ఊరేగింపు రెండు గంటలు ఆలస్యంగా బయలు దేరింది.

హత్యకేసులో సీబీఐ చార్జిషీటు దాఖలు

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనం సమీపంలోని మడప్పురం కాళికాంబల్ ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్ హత్యకేసుకు సంబంధించి సీబీఐ బుధవారం కోర్టులో చార్జిషీటు దాఖలు చేసింది. అజిత్‌కుమార్ హత్యకేసులో తిరుభువనం పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఐదుగురు పోలీసులను అరెస్టు చేసిన మదురై సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ వ్యవహారంలో మానామదురై డీఎస్పీ షణ్ముగ సుందరాన్ని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ కేసుపై విచారణ జరుపుతున్న సీబీఐ బుధవారం హైకోర్టు మదురై బెంచ్‌లో ఛార్జిషీటు దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో, అరెస్టయిన ఐదుగురు పోలీసులకు విధించిన జ్యుడిషియల్ కస్టడీ ఈనెల 13తో ముగియడంతో వారి రిమాండ్‌ను మరో 15 రోజులకు పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఇదిలా వుండగా, కోర్టులో సీబీఐ దాఖలు చేసిన తుది ఛార్జిషీటులో ప్రొఫెసర్ నికిత కారు పార్కింగ్ నుంచి బయటికి వెళ్లడం, కారులో నగలు చోరీ జరిగిందా? తదితర వివరాలను సీబీఐ అధికారులు పొందుపరిచారు.

బీజేపీ నాయకుడి దారుణహత్య

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలో భూ తగాదాల్లో బీజేపీ నాయకుడిని హత్యచేసి పరారైన నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విక్రవాండి ఆవడయార్‌పట్టుకి చెందిన కుమరన్ (48) బీజేపీ ఎస్సీ, ఎస్టీ విభాగం పంచాయతీ అధ్యక్షుడు. అదే ప్రాంతానికి చెందిన జాన్సన్(40) వ్యవసాయ భూమిని లీజుకు తీసుకునే వ్యవహారంలో వారి మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు తన అనుచరులతో వెళ్లిన జాన్సన్ మారణాయుధాలతో కుమరన్‌పై దాడి చేయడంతో మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు కుమరన్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి, పరారైన జాన్సన్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఆయిల్ ట్యాంక్‌లో పడి యువకుడి మృతి

అడయార్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం వివాహ నిశ్చితార్థం జరిగిన యువకుడు, ఆయిల్ ట్యాంక్‌లో పడి మృతిచెందాడు. తిరుప్పూర్ జిల్లా వెల్లకోయిల్ కేబీసీ నగర్‌కు చెందిన తిరుమూర్తి (30) వెల్లకోయిల్ - తారాపురం రోడ్డులోని చేరన్ నగర్‌లో ఉన్న ప్రైవేటు కిరోసిన్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. తిరుమూర్తికి డిసెంబరులో వివాహం చేయాలని కుటుంబీకులు నిర్ణయించారు. ఈ క్రమంలో, సోమవారం రాత్రి తిరుమూర్తి విధుల్లో పాల్గొన్నాడు. వేకువజామున 3 గంటల ప్రాంతంలో కర్మాగారంలోని మూడు అడుగుల లోతున్న గ్రౌండ్ లెవల్ ఆయిల్ ట్యాంక్‌లో పడిపోయాడు. చుట్టుపక్కల వారు అతన్ని వెలికి తీసి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

1 నుంచి సెంగుర్చి టోల్ పెంపు

అడయార్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉళుందూర్‌పేట సమీపం సెంగుర్చి టోల్ ప్లాజా రుసుము సెప్టెంబరు 1వ తేది నుంచి రూ.5 వరకు పెరగనున్నాయి. కార్లు, జీపులు తదితర వాహనాలకు వసూలు చేస్తున్న రూ.65 రుసుము రూ.70కి పెరగనుంది. అలాగే, భారీ వాహనాలకు వసూలు చేస్తున్న రుసుము రూ.115 నుంచి రూ.120 పెంచనున్నట్లు టోల్ ప్లాజా నిర్వాహకులు తెలిపారు.

సీమాన్‌పై కేసు నమోదుకు హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి):న్యాయవ్యవస్థను అసభ్యకరంగా విమర్శించారనే ఆరోపణలపై నామ్ తమిళర్ కట్చి ఆర్గనైజర్ సీమాన్‌పై కేసు నమోదుచేయాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. సీమాన్ వ్యాఖ్యలపై న్యాయవాది ఛార్లెస్ అలెగ్జాండర్ ఫిర్యాదుమేరకు పోలీసులు చర్యలు చేపట్టలేదంటూ మద్రాసు హైకోర్టులో అప్పీలు చేశారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం, సీమాన్‌పై కేసు నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

చెట్లే ప్రపంచానికి ఆధారం

● నామ్ తమిళర్ కట్చి చీఫ్ సీమాన్


చెట్టును ముద్దాడుతున్న సీమాన్

తిరుత్తణి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని అరుంగళంలోని అటవీప్రాంతంలో బుధవారం ఉదయం నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) చీఫ్ సీమాన్ చెట్లతో మాట్లాడుదాం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెట్లే ప్రపంచానికి ఆధారమన్నారు. మనం చెట్లను కాపాడితే.. అవి మనల్ని కాపాడుతాయన్నారు.

జీవితాన్ని పూర్తిగా మార్చిన చిత్రం 'బైసన్'


అనుపమ పరమేశ్వరన్

మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ధృవ్ విక్రమ్ హీరోగా నటిస్తున్న 'బైసన్' చిత్రం తన జీవితాన్ని పూర్తిగా మార్చివేసిందని ఆ చిత్ర హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ అన్నారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ.. 'పరియేరుమ్ పెరుమాళ్' కోసం దర్శకుడు మారి సెల్వరాజ్ మొదట నన్నే సంప్రదించారు. ఆ సమయంలో నేను పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉండటంతో అవకాశాన్ని వదులుకున్నా. మంచి చిత్రంలో నటించలేకపోయాననే బాధ ఇప్పటికీ ఉంది. ఆ తర్వాత 'మామన్నన్'లో కూడా ముఖ్య పాత్రకు అవకాశం వచ్చినప్పటికీ నటించలేకపోయా. చివరగా 'బైసన్'తో నా కల నెరవేరింది. మారి సెల్వరాజ్ కెరీర్‌లోనే మంచి చిత్రంగా ఇది నిలుస్తుంది. ఆయన టేకింగే భిన్నం. ఇప్పటివరకు ఏ ఒక్క చిత్రానికీ శిక్షణ తీసుకున్నది లేదు. కానీ, 'బైసన్' కోసం రెండు నెలల పాటు శిక్షణ తీసుకున్నారు. చిత్రీకరణ జరిగే గ్రామానికి వెళ్లి ఆ గ్రామ ప్రజలతో మమేకమైపోయాను. ఈ అనుభవం నా జీవితాన్నే మార్చివేసింది. ఇపుడు కమిట్ అయ్యే అన్ని చిత్రాల్లో బోల్డ్‌గా నటిస్తున్నా. దీనికి కారణం బైసన్ చిత్ర అనుభవమే' అని అనుపమ పరమేశ్వరన్ వెల్లడించారు.

'గ్యాంగ్‌స్టర్'గా 'లెజెండ్' శరవణన్

చిత్రజ్యోతి

'లెజెండ్' సినిమాతో తమిళ సినీ ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ వస్త్ర వ్యాపారి శరవణన్... ఇపుడు 'గ్యాంగ్‌స్టర్'గా వెండితెరపై కనిపించనున్నారు. తన తొలి చిత్రంతోనే సినీ విమర్శకుల నుంచి మంచి మార్కులు వేయించుకున్న శరవణన్.. ప్రస్తుతం తన రెండో చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. 'కొడి', 'గరుడన్' వంటి చిత్రాలను రూపొందించిన దురై సెంథిల్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ చిత్రంలో గ్యాంగ్‌స్టర్ పాత్రలో శరవణన్ నటించనున్నట్టు సమాచారం. పైగా ఈ మూవీకి ఇదే పేరును ఖరారు చేయాలని భావిస్తున్నారు. టైటిల్‌తో పాటు ఇతర వివరాలతో త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.


లొకేషన్‌లో లెజెండ్ శరవణన్

'మనుసి'ని వీక్షించనున్న న్యాయమూర్తి


ఆండ్రియా జెర్మయ్య

ఆండ్రియా జెర్మయ్య ప్రధాన పాత్రలో నటించిన 'మనుసి' చిత్రాన్ని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేకంగా వీక్షించనున్నారు. ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ నిర్మాణంలో గోపి నయినార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ మంజూరు చేసేందుకు బోర్డు తిరస్కరించింది. ఈ సినిమాను చూసిన సెన్సార్ బోర్డు సభ్యులు 37 సన్నివేశాలను తొలగించడంతో పాటు అనేక చోట్ల డైలాగులను మ్యూట్ చేయాలని సూచించారు. దీంతో నిర్మాత వెట్రిమారన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరగ్గా, ఇరు వర్గాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి ఈ సినిమాను చూసిన తర్వాత తీర్పు ఇస్తానని వెల్లడించారు. దీంతో ఈ నెల 24న స్థానిక రాజా అన్నామలైపురం, మ్యూజిక్ కాలేజ్, ఠాగూర్ ఆడిటోరియంలో ఉన్న ప్రివ్యూ థియేటర్‌లో సినిమాను చూడనున్నారు. సెన్సార్ బోర్డు నిబంధనలకు లోబడి తొలగించమన్న సన్నివేశాలు ఉన్నాయా? అనే అంశాన్ని బేరీజు వేసి ఆ తర్వాత తీర్పును వెలువరించనున్నారు.


స్వాతంత్ర్య సమరయోధుడు ఒండివీరన్ 254వ వర్ధంతిని పురస్కరించుకుని రాణిపేట జిల్లా ఆర్కాడులో బుధవారం ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

అరుంధతీయుల ఆరాధ్యదైవం ఒండివీరన్

● 254వ వర్ధంతి సభలో కొనయాడిన వక్తలు

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారతదేశ స్వాతంత్రం కోసం బ్రిటీష్ పాలకులతో వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన మొదటి స్వాతంత్ర సమర యోధుడు ఒండివీరన్ పగడై అరుంధతీయుల ఆరాధ్య దైవమని పలువురు వక్తలు కొనియాడారు. 17వ శతాబ్దంలో భారతదేశంలోకి వర్తక, వాణిజ్యాల నిమిత్తం అడుగుపెట్టిన బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ రైతులు పండించే పంటలకు శిస్తు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అప్పుడు తిరునల్వేలి పరిధిలోని పాళయంకోట సామ్రాజ్య పరిపాలకుడు పులిదేవన్ రాజ్యంలో సైన్యాధిపతిగా పనిచేసిన తెలుగుతల్లి ముద్దుబిడ్డ ఒండివీరన్ బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా శంకరన్‌కోవిల్, నెర్కాట్టాన్, వాసుదేవనల్లూరు తదితర ప్రాంతాల్లో జరిగిన యుద్ధంలో పాల్గొని విజయం సాధించారు. ఆయన విజయాన్ని చూసి ఖంగుతిన్న బ్రిటిష్ పాలకులు ఆ మహావీరుని చేతిని నరికారు. అయినప్పటికీ ఒంటిచేతితో శత్రులను మట్టికరిపి 1971 ఆగస్టు 20వ తేదీన ప్రాణత్యాగం చేసి దేశచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన 254వ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక పెరంబూరు సమీపంలో మేట్టుపాళయంలో బుధవారం ఉదయం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, తమిళనాడు విభాగం తరుపున సభ నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా తమిళనాడు ఎస్సీ,ఎస్టీ సంక్షేమ కమిషన్ సభ్యుడు ఎస్.సెల్వకుమార్, విశిష్ట అతిథులుగా తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ అధ్యక్షులు గొల్లపల్లి ఇశ్రాయేలు, అధ్యక్షుడు నేలటూరి విజయ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ తమిళనాడు అధ్యక్షుడు కర్రా లోకేష్ తదితర ప్రముఖులు హాజరై ఒండివీరన్‌కు నివాళులర్పించారు.


ఒండివీరన్ వర్ధంతి సభలో గోల్లపల్లి ఇశ్రాయేలు, నేలటూరి విజయ్‌కుమార్, సెల్వకుమార్, కర్రా లోకేష్ తదితరులు


టీఆర్‌బాలును పరామర్శిస్తున్న మక్కల్ నీదిమయ్యం అధినేత కమల్

టీఆర్ బాలుకు కమల్ పరామర్శ

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కోశాధికారి, ఆ పార్టీ లోక్‌సభ సభ్యుడు టీఆర్ బాలును బుధవారం ఉదయం మక్కల్ నీది మయ్యం అధినేత కమలహాసన్ ఆయన నివాస గృహంలో కలుసుకుని పరామర్శించారు. మంగళవారం ఉదయం బాలు సతీమణి రేణుకాదేవి కన్నుమూసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సతీవియోగంతో బాధపడుతున్న టీఆర్ బాలును కమల్ ఓదార్చారు. ముందుగా రేణుకాదేవి చిత్రపటం వద్ద కమల్ పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత బాలుతోపాటు ఆయన తనయుడు, రాష్ట్ర మంత్రి టీఆర్బీ రాజాను కమల్ ఓదార్చారు. రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అధ్యక్షుడు పూచ్చిమురుగన్ పాల్గొన్నారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 19 వినతులు

చెన్నై, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనర్ అరుణ్ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ వినతిపత్రాలపై విచారణ చేపట్టి పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించినట్లు నగర పోలీసు శాఖ పేర్కొంది.


కమిషనర్ అరుణ్‌కు సమస్య తెలుపుతున్న వృద్ధ దంపతులు

కోలాహలంగా మహిషాసుర సంహారం వేడుకలు

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా పల్లకచేరి చెల్లియమ్మన్, చాముండి ఆలయ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. త్యాగదుర్గం సమీపంలోని పల్లకచేరిలో ప్రసిద్ధిచెందిన చెల్లియమ్మన్, రాముండి అమ్మవారి ఆలయం ఉంది. ఈ ఆలయంలో యేటా రథోత్సవం, 10 ఏళ్లకు ఒకసారి మహిషాసుర సంహారం నిర్వహిస్తుంటారు. ఈ ప్రకారం, ఈ ఏడాది వేడుకలు ఈనెల 8వ తేది పుష్పార్చనతో ప్రారంభమయ్యాయి. వేడుకల్లో ప్రధానమైన మహిషాసుర సంహారం మంగళవారం సాయంత్రం జరిగింది. తొలుత అమ్మవారికి 16 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మహిషాసుర సంహారం నిర్వహించారు. మహిషాసుర భారీ విగ్రహాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించి పెద్ద చెరువు వద్దకు చేర్చారు.. అక్కడ అమ్మవారు రాక్షసుడిని సంహరించే వేడుక నిర్వహించారు.



మహిషాసుర సంహార వేడుకల్లో పాల్గొన్న భక్తులు

మసినగుడిలో పులి సంచారం


రోడ్డుపై సంచరిస్తున్న పులి

పెరంబూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా మసినగుడి జనవాస ప్రాంతాల సమీపంలో పులి సంచరించడం గ్రామస్తులను, వాహన చోదకులను భయభ్రాంతులకు గురిచేసింది. చిక్కిన శరీరంతో నడవలేని స్థితిలో రోడ్డుపై సంచరించిన పులిని గమనించిన వాహన చోదకులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని పులి ఆనవాళ్లు పరిశీలించారు. సమీపంలోని గ్రామాల ప్రజలు రాత్రి వేళ, అటవీ మార్గంలో వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించిన అధికారులు, పులి సంచరించిన ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేశారు.


రోప్‌కార్ సేవలను ప్రారంభిస్తున్న ఆలయ అధికారులు

పళనిలో రోప్‌కార్ సేవలు ప్రారంభం

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని దివ్యక్షేత్రంలో రోప్‌కార్ సేవలు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పళనిలో కొండపై ఉన్న దండాయుధపాణి స్వామివారి ఆలయానికి భక్తులు వెళ్లేందుకు వించ్, రోప్‌కార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, రోప్‌కార్ మార్గాల్లో చేపట్టిన మరమ్మతుల కారణంగా గత జూలై నెల 15వ తేదీ నుంచి ఆ సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. పనులు పూర్తికావడంతో బుధవారం ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం రోప్‌కార్ సేవలను ఆలయ అధికారులు పునః ప్రారంభించగా, భక్తులు ఉత్సాహంగా రోప్‌కార్‌లో ప్రయాణించారు.

15 ప్రాంతాల్లో రోప్‌కార్ సేవలు

పెరంబూర్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 15 ప్రాంతాల్లో రోప్‌కార్ సేవల ఏర్పాటు సమగ్ర నివేదిక పనులు చేపట్టారు. తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల్లోని కొండల్లో ఉన్న పర్యాటక ప్రాంతాలు,ఆలయాలకు వెళ్లేలా రోప్‌కార్ సేవలందించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. తిరువణ్ణామలై జిల్లా పర్వతమలై, తిరుపత్తూర్ జిల్లా ఏర్కాడు, తేని జిల్లా కురంగణి,తిరుచ్చి ఉచ్చిపిళ్లయార్ ఆలయం సహా 22ప్రాంతాలు పరిశీలించి,15 ప్రాంతాలు గుర్తించారు. జాతీయ రహదారుల కమిషన్ ద్వారా ఒప్పంద పద్ధతిలో సంస్థలను ఎంపిక చేసి, పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

● ఇండియా బిలియడ్స్ కోచ్ విజయ్‌కుమార్

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకుని జాతీయస్థాయిలో రాణించాలని ఇండియా బిలియడ్స్ కోచ్ విజయ్‌కుమార్ పేరూరు పేర్కొన్నారు. నగరంలోని ఎస్‌కేపీడీ చారిటీస్ నిర్వహిస్తున్న కేటీసీటీ బాలికలు, ఎస్‌కేపీడీ బాలుర ప్రాథమిక మహోన్నత పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక క్రీడా పోటీలో విజేతలకు బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎస్కేపీసీ ప్రాంగణంలో బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలల గౌరవ కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విజయ్‌కుమార్ పేరూరు, గౌరవ అతిథిగా లైఫ్ బోట్ ఫౌండేషన్ ట్రస్టీ కె.అయ్యప్పన్, కేటీసీటీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె.అనిల, సి.రేవతి, స్పోర్ట్స్ కార్యదర్శి వి.దేవి, ఎస్‌కేపీడీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఓరుగంటి లీలారాణి, ఇ.రమేష్, స్పోర్ట్స్ సెక్రటరీ పి.గౌరీశంకర్ తదితరులతో అతిథులు విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.


విజేతలతో ఎస్ఎల్ సుదర్శనం, విజయ్‌కుమార్, అయ్యప్పన్ తదితరులు

కడలూరులో 'సీకే ఆహార కేంద్రం'

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తీ గౌరవప్రదమైన భోజనానికి అర్హులన్న తన ముత్తాత వారసత్వాన్ని కొనసాగిస్తున్న కెవిన్ కేర్ చైర్మన్ ఎండీ సీకే రంగనాథన్ కుమార్తె సీకే విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అముదవల్లి రంగనాథన్ మంగళవారం కడలూరులో 'సీకే ఉనవగం' పేరుతో ఆహారకేంద్రాన్ని ప్రారంభించారు. ఇది విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గౌరవప్రదమైన భోజన సేవ. 4,500 అడుగుల విస్తీర్ణంలో 200 కంటే ఎక్కువ సీటింగ్ సామర్థ్యంతో విస్తరించి వున్న ఈ కేంద్రంలో ప్రతిరోజూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రిపూట భోజనం కేవలం రూ.10 నుంచి అత్యంత సరసమైన ధరలకు అందిస్తారు. ఈ ఆహారకేంద్ర ప్రారంభోత్సవం సందర్భంగా అముదవల్లి మాట్లాడుతూ.. తన ముత్తాత వారసత్వాన్ని, తన తండ్రి దార్శనికతను సజీవంగా తీసుకురావడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. నేటి విద్యార్థులకు సేవ చేయడమంటే ఏమిటో తెలుసుకోవడానికి ఈ కేంద్రం దోహదపడుతుందని వివరించారు.

ఆహార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అముదవల్లి రంగనాథన్


సెప్టెంబర్ 22 నుంచి ఎస్‌కేపీడీలో

నవరాత్రి మహోత్సవం

● భక్తిశ్రద్ధలతో స్తంభప్రతిష్ఠ పూజలు

ప్యారీస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో దాదాపు మూడువందల యేళ్ల చరిత్ర కలిగిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22వ తేదీ నుంచి కలశ స్థాపన పూజలతో నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో స్తంభ ప్రతిష్ఠ పూజలు శాస్త్రోక్తంగా ఆలయ పూజారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్, ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, ఎస్ఎల్ సుదర్శనం, టి.బద్రినాథ్, కార్యదర్శి ఎం.కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద వినియోగం జరిగింది. ఇక అక్టోబర్ 1 నుంచి 12వ తేదీ వరకు వడయాతి ఉత్సవాలు నిర్వహించనున్నారు.


స్తంభ ప్రతిష్ఠ పూజల్లో ఎస్‌కేపీడీ అర్చకులు, ట్రస్టీలు

ఐకరాజ్య సమితి సమావేశానికి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా తమిళనాడులోని గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఐకరాజ్య సమితి అంతర్జాతీయ యువజన సమావేశంలో పాల్గొననున్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో బ్యాంకాక్‌లో జరుగనున్న ఈ సమావేశంలో రాష్ట్రానికి చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రాతినిధ్యం వహించడం విశేషం. నామక్కల్ జిల్లా కీరంబూర్‌లోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన వైఎస్ యాలిని (16), ఇదే జిల్లాకు చెందిన కొరపాళయంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన కమలేష్ (15), తంజావూరులోని ప్రభుత్వ మోడల్ ఉన్నత మాధ్యమిక పాఠశాలకు చెందిన ఎం.ధరణిశ్రీ(13), వేలూరు జిల్లా లాథేరిలోని ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూలుకు చెందిన నిశాంతిని(15), చెంగల్పట్టు జిల్లా కందిగైలోని ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలకు చెందిన వి.రాహుల్, సేలంలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన శరవణ (16) ఈ సమావేశంలో పాల్గొననున్నారు. లోతుగా పరిశీలించిన పిదప రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఈ ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసింది. ఈ విద్యార్థుల విదేశీ యానానికి ప్రధాన స్పానర్‌గా జీఆర్‌టీ హోటల్స్ అండ్ రిసార్ట్స్ నిలిచింది. ఈ సందర్భంగా ఈ సంస్థ సీఈవో విక్రమ్ కోటా విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న జీఆర్‌టీ హోటల్స్ నిర్వాహకులు

శ్రీ రామచంద్ర మెడికల్ సెంటర్‌లో

'ది న్యూ ఇండియా అస్యూరెన్స్' హెల్ప్ డెస్క్

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని శ్రీ రామచంద్ర మెడికల్ సెంటర్‌లో 'ది న్యూ ఇండియా అస్యూరెన్స్' కంపెనీ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది. శ్రీరామచంద్ర ఉడయార్ బ్లాక్‌లో ఈ కేంద్రాన్ని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గిరిజా సుబ్రమణియన్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజురోజుకు వైద్య ఖర్చులు పెరుగుతున్నందున ప్రతి ఒక్కరికీ మెడిక్లెయిమ్ బీమా అవసరమని తెలిపారు. ఈ హెల్ప్ డెస్క్ జాతీయ క్లెయిమ్ మార్పిడి, నగదు రహిత క్లెయిమ్ ప్రక్రియలకు తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామచంద్ర మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ కె.బాలాజీ సింగ్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ సింగ్, జనరల్ మేనేజర్లు ఆర్.మోహన్, రమేష్, న్యూ ఇండియా అస్యూరెన్స్ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంవీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న గిరాజా సుబ్రమణియన్

ముగిసిన విశ్వశాంతి మహాయాగం





తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో నాలుగురోజుల పాటు నిర్వహించిన సంగోపాంగ శ్రీశ్రీనివాస విశ్వశాంతి మహాయాగం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. 32 మంది వేదపండితుల సమక్షంలో వైదిక క్రతువులు జరిగాయి. ఈ యాగానికి హాజరైన ఈవో శ్యామల రావు మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వశాంతి యాగాలు, హవనాలను నిర్వహించాలని టీటీడీ నిర్ణయం తీసుకుందన్నారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పీఠం ప్రిన్సిపల్ కుప్పా శివ సుబ్రహ్మణ్యం అవధాని పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి ఆలయం వద్ద జస్టిస్ సంజయ్ కరోల్

తిరుచానూరు, ఆగస్టు 20(ఆంధ్ర జ్యోతి): పద్మావతి అమ్మవారిని బుధవారం రాత్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కరోల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీంధర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆయనను ఆలయ వేదపండితులు ఆశీర్వదించి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.5.30 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,033

తలనీలాలు సమర్పించినవారు: 26,905

స్విమ్స్‌లో పులివెందుల పెత్తనానికి ఈసారైనా బ్రేక్ పడేనా?

- మెడికల్ మాఫియాకి యంత్రాంగం అండ
- మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురాని వైనం
- నేడు నాలుగోసారి తెరవనున్న టెండరు

పులివెందుల పెత్తనం నుంచి స్విమ్స్ ఇప్పటికీ బయటపడడంలేదు. కొందరు అధికారుల అండతో యథేచ్ఛగా వారి హవా కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ అధీనంలోకి స్విమ్స్ వచ్చీ రాగానే రాజకీయ పెత్తనం పెరిగిపోయింది. జనరిక్ (జన ఔషధి)మెడికల్ షాపులు పేరిట అప్పటి టీటీడీ ఛైర్మన్లు వారి అనుచరులకు చెరొక మెడికల్ షాపులను కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ షాపులను రద్దుచేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. ఎట్టకేలకు ఒక షాపును రద్దుచేయగలిగారు. అయితే స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద పులివెందులకు చెందిన వ్యక్తుల చేతిలో ఉన్న మెడికల్ షాపును మాత్రం కదిలించలేకపోతున్నారు. కేవలం రూ.17వేల నామమాత్రపు అద్దెతోనే దీనిని కేటాయించారు. ప్రస్తుతం రూ.60వేలకు పెంచారు. దాదాపు నెలకు రూ.15లక్షలకు పైగా అద్దెవచ్చే అవకాశం ఉన్న షాపును నామమాత్రపు అద్దెతో కేటాయించడంపై మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం టీటీడీ మూడు సార్లు టెండర్లు పిలిచింది. కానీ, టెండరులో పాల్గొనేందుకు ఎవరూ ముందుకురాలేదు. రూ.25లక్షల అద్దెతో పాటు రూ.25కోట్ల టర్నోవర్ ఉండాలని అసాధారణ నిబంధనలు పెట్టడంవల్లే ఎవరూ ముందుకు రాలేదన్న విమర్శలు ఉన్నాయి. పులివెందులకు చెందిన వైసీపీ బ్యాచ్‌కు అనుకూలంగా కొందరు అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా అసాధారణ అంశాలు చేర్చడం వలనే టెండర్లలో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రావడంలేదని టీడీడీ ఆలస్యంగా గ్రహించింది. ఈక్రమంలో టర్నోవర్‌ను మాత్రం రూ.25కోట్లు ఉంచి నెలవారి అద్దెను రూ.25లక్షల నుంచి రూ.15లక్షలకు తగ్గిస్తూ గతనెల 25వ తేదీ టీటీడీ నాలుగోసారి టెండరు నోటిఫికేషన్ ఆహ్వానించింది. నెలకు రూ.15లక్షల అద్దెతో టెండర్లలో పాల్గొనేందుకు ఆసక్తిచూపుతున్నారు కానీ రూ.25కోట్ల టర్నోవర్ నిబంధన అడ్డుగామారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తిరుపతిలో రెండు, మూడు రిటైల్ షాపులు మినహా తక్కిన షాపులవారికి రూ.25కోట్ల టర్నోవర్ ఉండడం అసాధ్యం. అందుకే తెలంగాణనుంచి పలువురు టెండర్లలో పాల్గొన్నట్టు తెలిసింది. కాగా బుధవారం టెండర్లు తెరవాల్సివుండగా గురువారానికి వాయిదా వేస్తున్నట్టు టీటీడీ రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఈసారైనా టెండరు విజయవంతమవుతుందో లేదో వేచిచూడాలి.



శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద మెడికల్ షాపు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వచ్చేనెలలో బీవీఎస్సీ తరగతులు ప్రారంభం

తిరుపతి రూరల్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీ పరిధిలో యూజీ(బీవీఎస్సీ) కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. వర్సిటీకి అనుబంధంగా ఉన్న తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి కళాశాలల్లో ఏపీ ఈఏపీసెట్ ర్యాంకు ప్రాతిపదికన అడ్మిషన్లు చేపడుతున్నారు. ఈఏపీసెట్ ద్వారా 85శాతం, వీసీఐ కోటా కింద(నీట్ ర్యాంకు ఆధారంగా)15శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు. రైతు కోటా ద్వారా 25శాతం సీట్లను భర్తీ చేస్తున్నారు. స్థానికతకు సంబంధించి న్యాయస్థానంలో తీర్పు వెలువడిన నేపథ్యంలో సర్టిఫికెట్ల పరిశీలన ఈవారంలో పూర్తికానుందని వర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య తెలిపారు. కోర్సులో చేరేందుకు దాదాపు 6వేలమంది దరఖాస్తు చేశారు.

ఎన్నారై కోటాకు ప్రతిపాదన

వర్సిటీలో 13ఏళ్ల కిందట ఎన్నారై కోటా రద్దయింది. బోర్డు ఆదేశాల మేరకు ఈ కోటా పునరుద్ధరణకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు పంపారు. తాద్వారా వర్సిటీలో 45సీట్లకు అవకాశముంటుంది. ప్రభుత్వం అనుమతిస్తే ఈసీట్ల ద్వారా ఏడాదికి దాదాపు రూ.కోటి వరకు అదనపు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. కాగా ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా ఒక్కో కళాశాలలో 70సీట్లు ఉన్నాయి. ఐదున్నరేళ్లలో నాలుగున్నరేళ్ల కళాశాలలో విద్యాబోధన సాగుతుంది. ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ పీరియడ్‌లో క్షేత్రస్థాయిలో పశువైద్య ఆసుపత్రుల్లో పనిచేయాలి.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండు

బీవీఎస్సీ కోర్సులు చదివిన వారికి వివిధరంగాలలో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. పశుసంవర్ధకశాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్), పౌల్ట్రీ, డెయిరీ, ఫార్మాస్యూటికల్ సంస్థల్లో అవకాశాలు ఉన్నాయి. ప్రైవేట్ ప్రాక్టీస్ ద్వారా ఉపాధి. ఆలిండియా స్థాయిలో వెటర్నరీ ప్రాక్టీషనర్‌గా పనిచేయొచ్చు. ప్రత్యేకించి విదేశాలల్లో వెటర్నేరియన్స్‌కి డిమాండ్ ఉంది. ప్రతిష్టాత్మక యూపీఎస్సీ ఏపీపీఎస్సీలలో రాణించేందుకు వెటర్నరీవిద్య దోహదం చేస్తుంది.



ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య

- డాక్టర్ వీరబ్రహ్మయ్య, వెటర్నరీ డీన్

55 ఏళ్ల భూవివాదానికి పరిష్కారం

- అటవీశాఖకు భూములు తిరిగి అప్పగింత
- బాధిత రైతులకు మరోచోట పట్టాలిచ్చేందుకు ఒప్పందం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఇనగలూరు రెవెన్యూ పరిధిలోని సింహాచలకండ్రిగ, గొల్లపల్లి పంచాయతీల్లో 55 ఏళ్ల అటవీ భూముల వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. అక్కడి రైతులతో జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అటవీశాఖ, రెవెన్యూశాఖ అధికారులు, సింహాచలకండ్రిగ రైతులతో బుధవారం పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో సుదీర్ఘ చర్చలు జరిపారు. చర్చల వివరాలను విలేకరుల సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. 1970లో అప్పటి ప్రభుత్వం 130 ఎకరాలకు సంబంధించి రైతులకు పట్టాలు పంపిణీ చేసిందన్నారు. అయితే ఈ భూమి రిజర్వు ఫారెస్టు కావడంతో 1978లో అప్పటి కలెక్టర్ రద్దు చేశారన్నారు. తరువాత 1998లో 98 కుటుంబాలకు 130 ఎకరాల భూమి పంపిణీ చేస్తూ పట్టాలు జారీచేశారన్నారు. 2008లో అటవీశాఖ అధికారులు మళ్లీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈక్రమంలో 2014లో న్యాయస్థానం ఈ భూములను అటవీశాఖవిగా గుర్తించి పట్టాలను రద్దు చేసినట్లు వివరించారు. ఇలా 55 ఏళ్లుగా అటవీశాఖ, సింహాచలకండ్రిగ గ్రామస్థుల మధ్య వివాదం నలుగుతూనే ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజ్ఞప్తితో తాను వచ్చి రెవెన్యూ, అటవీశాఖ, రైతుల సమక్షంలో చర్చించినట్లు తెలిపారు. అటవీ భూములను తిరిగి ఆ శాఖకు అప్పగించి బాధిత రైతులకు సమీప ప్రాంతంలో సాగుకు అనువైన భూములను కేటాయిస్తామన్నారు. వీటికి పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అటవీశాఖ స్వాధీనం చేసుకుంటున్న భూమిలో నీలగిరి తైలం మొక్కలను పెంచి వనసంరక్షణ కమిటీ ఏర్పాటు ద్వారా రైతులకు ప్రతి మూడు, నాలుగేళ్లకోసారి రూ.20వేల నుంచి రూ.50వేల వరకు స్థిరమైన ఆదాయం కల్పించేలా కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ నిర్ణయాలకు రైతులు అంగీకరించి హర్షం వ్యక్తం చేశారన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సింహాచలకండ్రిగతో పాటు బీవీపురం, గొల్లపల్లి గ్రామాల్లో నెలకొన్న 1,150 ఎకరాలకు సంబంధించి భూవివాదాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

తిరుపతిలో 'అమరావతి చాంపియన్ షిప్'

- ఈ నెల 24, 25, 26వ తేదీల్లో నిర్వహణ
- శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి (క్రీడలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో "అమరావతి చాంపియన్ షిప్-2025" పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈ నెల 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిథ్యమిస్తుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీల్లో రెండు వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 29వ తేదీన విశాఖపట్నంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తారని రవినాయుడు స్పష్టం చేశారు.



పేకాట ఆడుతున్న జూదరులు

డ్రోన్‌కు చిక్కిన జూదరులు

- 11మంది అరెస్టు.. 9 మంది పరారీ
- రూ.2,36,740, 12సెల్‌ఫోన్లు, 4 బైక్‌లు స్వాధీనం

ఏర్పేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కింద పట్ట పరిచారు. ఒక పక్క పరదా కట్టారు. ఇలా రోడ్డుకు దూరంగా పొలాల్లో పేకాట స్థావరం పెట్టారు. ఎక్కడో పొలాల్లో ఉన్న తమను ఎవరు పట్టుకుంటారులే అని ధీమాగా పేకాట ఆడుతున్న వారు.. ఆకాశం నుంచి నిఘా పెట్టిన డ్రోన్‌కు చిక్కారు. ఏర్పేడు మండలం మేర్లపాక, బండారుపల్లి, ముసలిపేడు, కందాడు, రామలింగాపురం గ్రామాల్లో డ్రోన్ ద్వారా పోలీసు బీట్ పెట్టారు. సైబర్ క్రైం సీఐ, డ్రోన్ కెమెరాల ఇన్‌ఛార్జి వినోద్‌కుమార్ పర్యవేక్షణలో పది మంది పోలీసులు పేకాట స్థావరాలపై డ్రోన్ నిఘా పెట్టారు. బండారుపల్లి, ముసలిపేడు సరిహద్దు పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు. పేకాట ఆడుతున్న మూడు ప్రాంతాలపై దాడులు నిర్వహించి 11మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో 9మంది పరారయ్యారు. పేకాట స్థావరాల నుంచి రూ.2,36,740 నగదు, 12 సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో తిరుపతికి చెందిన ఇద్దరు, కడపకు చెందిన ఐదుగురు, అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన ఇద్దరు, కోడూరుకు చెందిన ఒకరు, కలకడకు చెందిన ఒకరు చొప్పున ఉన్నారు. వీరిని ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

డిసెంబరులోగా కొత్త భవనం అప్పగించండి

- రైల్వే జీఎం సంజయ్ కుమార్ ఆదేశం

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా దక్షిణం వైపు నిర్మిస్తున్న భవనాన్ని ఈ ఏడాది డిసెంబరులో అప్పగించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు సంజయ్ కుమార్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రైల్వేస్టేషన్‌లో చేపట్టిన నిర్మాణాల ప్రణాళికను పవర్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. అనంతరం అధికారులతో సమీక్షించాక సాధారణ ప్రయాణికుల విశ్రాంతి గదుల్లో సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణాలను అప్పగించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా, జోనల్ సీఈ సూర్యనారాయణ, కార్యదర్శి మల్లాడి శ్రీనివాస్, సీనియర్ స్కేల్ అధికారులు సుదర్శన్‌రెడ్డి, మనికంఠ, మనోజ్, శ్రావణ్ కుమార్, సూర్యనారాయణ, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ కె.చిన్నప్పరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా జీఎంను రాజస్థానీ బ్రాహ్మణ్ మహాసభ నాయకులు కలిశారు. తిరుపతి-బికనీర్‌ల మధ్య రెగ్యూలర్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని రైల్వే కూలీలు వినతి పత్రం సమర్పించారు. డీఆర్ఎంతో జీఎం మాట్లాడి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయనకు స్టేషన్ అభివృద్ధి పనుల గురించి అధికారులు వివరించారు. అనంతరం ఆయన ప్రత్యేక కోచ్‌లో సికింద్రాబాద్ బయలుదేరి వెళ్లారు. అంతకుముందు ఉదయం రైల్వేజీఎం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.



రైల్వేస్టేషన్ భవన నిర్మాణాలను పరిశీలించి సూచనలిస్తున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ

ఆర్టీసీ బస్సులు ఫుల్

- ఫుట్‌పాత్ మీద ప్రమాదం అంచున ప్రయాణాలు



బస్సు వెలుపల రద్దీ



బస్సులోపల రద్దీ

పుత్తూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకంతో పల్లెవెలుగు బస్సులన్నీ లోపల బయటా నిండిపోతున్నాయి. ఫుట్‌పాత్ ప్రయాణంతో ప్రమాదం అంచున నడుస్తున్నాయి. ప్రత్యేకించి కళాశాలలు, కార్యాలయాల ముగింపు వేళల్లో అదుపు చేయలేని రద్దీతో బస్సులు కదులుతున్నాయి. సత్యవేడు, నగరి, చిత్తూరు మార్గాల్లో గతంలో ఆటోల్లో వెళ్లే మహిళలు ఇప్పుడు ఓపికతో వేచి వుండి పల్లెవెలుగు బస్సులు ఎక్కుతున్నారు. రోజురోజుకూ ఆక్యుపెన్సీ రేటు పెరుగుతోందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆయా రూట్లలో అదనపు సర్వీసులను నడపాలని మహిళలు కోరుతున్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



బోడేవాండ్ల పల్లెవద్ద పట్టుబడిన వాహనాలతో పాటు ఎర్రచందనం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బోడేవాండ్లపల్లెవద్ద ఎర్రచందనం స్వాధీనం చేసుకొన్నట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా.. బోడేవాండ్లపల్లెవద్ద టీ జంక్షన్ వద్ద బుధవారం వేకువజామున ఓ ద్విచక్ర వాహనం, దాని వెనుక వ్యాను అతివేగంగా వెళ్లడం ఫారెస్ట్ సిబ్బంది గమనించారు. వెంటనే నిలువరించేందుకు వేగంగా వెంబడించారు. దీంతో నిందితులు తమ వాహనాలను రోడ్డుపై నిలిపి పరారయ్యారు. సిబ్బంది వాహనాలను పరిశీలించగా 395 కేజీల బరువు గల 10 ఎర్రచందనం దుంగలున్నాయి. వాహనాలతో దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

- డెప్యుటేషన్‌పై వెటర్నరీ వర్సిటీకి

వెంకటగిరి పశువైద్య ఏడీ బదిలీ

తిరుపతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎంవీ స్వామిబాబు డెప్యుటేషన్‌పై తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి బదిలీ అయ్యారు. ఇక్కడ ఏడాది పాటు ఆయన కొనసాగనున్నారు. వర్సిటీ పరిధిలోని సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ వెటర్నరీ ఎడ్యుకేషన్‌లో గానీ లేదా తిరుపతిలోని వర్సిటీ ప్రధాన కార్యాలయంలో టెక్నికల్ ఆఫీసర్‌గా గానీ ఆయన సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం వర్సిటీ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.

'పుష్పిత్ స్టీల్స్'లో కార్మికుడి మృతి

- కర్మాగారం ఎదుట మృతుడి బంధువుల ధర్నా



పరిశ్రమ వద్ద బంధువుల ధర్నా



మహేష్ ఫైల్ ఫొటో

ఏర్పేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మేర్లపాక పంచాయతీలోని 'పుష్పిత్ స్టీల్స్'లో మెకానిక్‌గా పనిచేస్తున్న మేర్లపాక వాసి మహేష్(45) బుధవారం మృతిచెందారు. విధినిర్వహణలో ఉన్న ఆయన సొమ్మసిల్లి పడిపోవడంతో హుటాహుటిన కంపెనీ వాహనంలో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు యాజమాన్యం తెలిపింది. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, తీవ్ర పని ఒత్తిడి వల్లే కర్మాగారం లోపలే మహేష్ చనిపోయాడని, బతికి ఉన్నట్లు ఆస్పత్రికి తీసుకెళ్లి యాజమాన్యం నాటకాలు ఆడారని ఆయన బంధువులు ఆరోపిస్తున్నారు. కర్మాగారంలోని పెద్ద కీలన్‌పైకి బలవంతంగా ఎక్కించారని, అక్కడ ఆయన చనిపోయినట్లు వారు చెబుతున్నారు. ఈ క్రమంలో న్యాయం కావాలని, మహేష్ మృతికి కారణమైన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ మృతదేహంతో పుష్పిత్ స్టీల్స్ ఎదుట బంధువులు, గ్రామస్థులు ధర్నా చేశారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి భద్రత కల్పించాలని కోరారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నర్సింగ్ అభ్యర్థులకు జర్మన్ భాషపై శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ నర్సింగ్ అభ్యర్థులకు శుక్రవారం నుంచి జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఈ శిక్షణ ఉంటుందని ఎస్సీ సంక్షేమ శాఖ సాధికారత అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉచిత వసతితోపాటు శిక్షణ ఇస్తారని వివరించారు. ప్రారంభ కార్యక్రమంలో మంత్రి బాలా వీరాంజనేయస్వామి పాల్గొంటారన్నారు.

మరో 24 మందికి టీడీఆర్ బాండ్లు

తిరుపతి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన 24 మందికి టీడీఆర్ బాండ్లను బుధవారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అందజేశారు. నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. ఇందులో అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్ చేశామని తెలిపారు. పలుమార్లు టీడీఆర్ కమిటీ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించామన్నారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 267 మందికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేశామన్నారు. కాగా బుధవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు అన్ని పత్రాలను పరిశీలించి ఎంపిక చేశామని అన్నారు. డీసీపీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు అనధికార కేబుల్స్ తొలగించండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంతోపాటు టౌన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ స్థంభాలకు అనధికారంగా వున్న కేబుల్ వైర్లను తొలగించాలని లేదంటే తమ సిబ్బంది శనివారం నుంచి తొలగిస్తారని సదరన్ డిస్కం ఈఈ వి.చంద్రశేఖర్ రావు బుధవారం స్పష్టంచేశారు. విద్యుత్ స్తంభాలకు ఇబ్బడి ముబ్బడిగా అనధికార కేబుల్ వైర్లు ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు మార్లు కేబుల్ ఆపరేటర్లుకు వైర్లు తొలగించాలని కోరామన్నారు. అయినా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడటానికి కఠినమైన నిర్ణయాలు తీసుకొంటున్నామని వెల్లడించారు. వినాయకచవితి మండపాల నిర్వాహకులు రుసుం చెల్లించి తాత్కాలిక విద్యుత్ సర్వీసులను పొందాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఈపీతో సత్వర అభివృద్ధి

- హెచ్‌సీయూ మాజీ వీసీ పొదిలి అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020 అమలుతో దేశం సత్వర అభివృద్ధి సాధిస్తుందని హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు పేర్కొన్నారు. ఐదేళ్ల ఎన్ఈపీ అమలు - ప్రగతి అంశంపై అఖిల భారతీయ శిక్షక్ మహా సంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 37 ఏళ్లుగా దేశ విద్యా విధానంలో ఎలాంటి మార్పులూ తీసుకురాలేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెరిగిన నేపథ్యంలో మార్పులు అవసరమని కేంద్ర ప్రభుత్వం భావించిందన్నారు. ప్రభుత్వ రంగంలోనే కాకుండా ఐటీ, ఫార్మా, అగ్రి, డెయిరీ వంటి రంగాల్లో స్వయం ఉపాధిని కల్పించేలా అనేక నూతన కోర్సులు ప్రవేశ పెట్టినట్టు చెప్పారు. ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ దేశంలో కేజీ నుంచీ పీజీ దాకా ఎన్ఈపీ పటిష్టంగా అమలు అవుతుందన్నారు.తద్వారా విద్యా రంగంలో మంచి ఫలితాలు సాధించినట్టు తెలిపారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ అధ్యక్షుడు గుంతా లక్ష్మణ్ మాట్లాడుతూ చైనా, జపాన్, జర్మనీ దేశాల్లో ప్రాథమిక దశ నుంచి ఉన్నత విద్య వరకూ అంతా మాతృభాషలోనే విద్య అందిస్తున్నారని,మన దేశంలోనూ ఇదే తరహా బోధన అందించే అవకాశాన్ని ఎన్ఈపీ కల్గించిందని అన్నారు. విద్యకు బడ్జెట్‌లో 6 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రామిరెడ్డి, ఉపాధ్యక్షురాలు వాణి, విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.